# గాంధారి

జ్యోతిష్కులు తన జాతక చక్రాన్ని పరిశీలిస్తున్న విషయం పరిచారికల ద్వారా వింది గాంధారి. భవిష్యజీవితం గూర్చి ఏం చెప్తున్నారో వినాలనే కుతూహలం కలిగిందామెకు. ఏ కన్య మాత్రం తన భవిష్యత్తు బంగారు పూలబాట కావాలని కోరుకోదూ? పసితనంనుంచీ తను చాలా అదృష్టవంతురాలని అందరూ అనుకోటం తనకి తెలుసు. అయినా పండితుల నోటివెంట ఆ మాట వినాలి.

గాంధారి వెంటనే బయలుదేరింది. రాజ ప్రసాదంలో పండితులున్న ప్రాంతం చేరింది. చాటుగా నిలబడి వారి మాటలు శ్రద్ధగా ఆలకించసాగింధి.

"ఆహా, అపూర్వమైన జాతకం! మహా పతివ్రతలను మించిన పతిభక్తి, ఏ మహారాణి అనుభవించని రాజభోగం, ఏ స్త్రీ మూర్తి ఊహించలేని సంతాన సంపద ఈ జాతకంలో ప్రస్ఫుటంగా కానవస్తున్నాయి."

పండితుల పల్కులు గాంధార రాజైన సుబలునికి ఎంతో ఆనందాన్ని కలిగించాయి.

"అయ్యా, మా కుమార్తెకు వివాహ శుభ గడియలు ఎప్పుడు రానున్నవో తమరు సెలవిస్తే..." సుబలుడు సవినయంగా చేతులు జోడించాడు.

"శుభస్య శీఘ్రం, త్వరలోనే ఈమె మహారాజు భార్య కాబోతుంది. శతాధికమైన సంతానానికి మాతృమూర్తి అవుతుంది."

చాటుగా పండితుల వాక్కు వింటున్న గాంధారి ముఖాన చిరు చెమట అలముకుంది. అడుగుల చప్పుడు తెలియనీయకుండా నెమ్మదిగా అంతఃపురం చేరుకుంది.

జ్యోతిశ్శాస్త్రజ్ఞులు చెప్పిన గాంధారి జాతక విశేషాలు త్వరలోనే అంతటా తెలిసిపోయాయి.

*   *   *

ధృతరాష్ట్రుడు, పాండురాజు సింహకిశోరాల్లా భీష్ముని అండదండల్లో పెరుగుతున్నారు. అమిత బల పరాక్రమాలు సంతరించుకుని, యౌవన ప్రాంగ

ణంలో అడుగుపెట్టిన వారికి వివాహ యోగ్యమైన వయసు వచ్చిందని తలచాడు భీష్ముడు.

గాంధార రాజకుమార్తె జాతక విశేషాలు భీష్ముని చెవిని చేరాయి. వెతుకుతున్న తీగ కాలికి తగిలినట్టే అనిపించింది. సుబలుని కుమార్తె శతాధిక సంతానవంతురాలవుతుందన్న విషయం భీష్మునికి మరీ నచ్చింది. కురు వంశాభివృద్ధిని కాంక్షించే తను ఎలాగైనా ఈ సంబంధం ధృతరాష్ట్రునికి ఖాయం చేయాలని నిశ్చయించుకున్నాడు.

భీష్ముని నుంచి వచ్చిన పురోహితులను సాదరంగా ఆహ్వానించాడు సుబలుడు. ధృతరాష్ట్రుని జాతకచక్రం అందిస్తూ భీష్ముని సందేశాన్ని వివరించారు వారు.

గాంధారరాజు మనసు ఆనంద డోలికల్లో తేలిపోయింది. కురు వంశాధిపతికి తన కుమార్తెనిచ్చి వివాహం చేయటం కన్నా మరొక భాగ్యం ఏమి ఆశిస్తాడు తను?

గాంధార రాజు ధృతరాష్ట్రుని జాతకచక్రం పరిశీలిస్తున్న జ్యోతిష్కుల వైపు, వారి ముఖ కవళికల వైపు చూపు నిలిపాడు.

ఉద్యానవనంలో విహరిస్తున్న గాంధారికి ఈ వార్త అందించింది ఇష్టసఖి. గాంధారి కళ్ళనిండా కొత్త వెలుగు నిండింది.

"వేగంగా వెళ్ళు-విశేషాలన్నీ నాకు వచ్చి చెప్పు." త్వరపెట్టింది గాంధారి స్నేహితురాలిని.

కానీ గాంధారి మనసు అక్కడికి పరుగెత్తింది. తనూ వెళ్ళి రహస్యంగా వినాలనే కోరిక ఎంత వారించాలని ప్రయత్నించినా సాధ్యంకాలేదు గాంధారికి. స్నేహితురాలిని వెనక్కి నెట్టి, గుమ్మం దగ్గర వెనగ్గా నిలబడింది గాంధారి.

పండిత చర్చ జరుగుతోంది. గాంధార రాజు చాలా శ్రద్ధగా అంతా వింటున్నాడు.

క్షణాలు గడవటం కష్టంగా అనిపిస్తోంది గాంధారికి. ఊపిరి బిగబట్టింది.

"అద్భుతమైన జాతకం. మహాసామ్రాజ్యాధిపతి. గురుభక్తి, బంధుజన ప్రీతి ఈ జాతకుని ప్రథమ గుణాలు. ఈ జాతకుని శరీర దారుఢ్యం అనంత శక్తివంతమైంది. వేయి ఏనుగుల బలాన్ని మించిన బలం ఇతనిది. శతాధిక సంతానం. మహావీరుడు."

గాంధారికి ఆనందం పట్టరానిదైంది. జ్యోతిష్కులు ఆ తర్వాత ఏమేం చెప్తున్నారో అనే ఆలోచన లేకుండా, ఎంతో వేగంగా స్నేహితురాలితో కలసి అంతఃపురానికి దారితీసింది. ఇక వినవలసింది లేదనుకుంది తృప్తిగా.

అంతఃపురంలోనూ స్తిమితంగా కూచోలేని గాంధారి ఉద్యానవనం ప్రవేశించింది. ఆ ఉద్యానవన శోభ వేయిరెట్లు పెరిగినట్లనిపించిం దా క్షణంలో.

అతను మహారాజా, వీరుడా, శూరుడా, రూప సంపన్నుడా, పరాక్రమశాలా, అమిత పుత్ర సంతానవంతుడా - గాంధారి ధృతరాష్ట్రుని గురించి పండితులు చెప్పిన మాటలు మళ్ళీ మళ్ళీ తలచుకుంటూ పరవశించింది.

"వేయి ఏనుగుల బలంట విన్నావా, ఆ బలవంతుని భార్యగా ఇంత సుకుమారివి నువ్వు!'' చెలికత్తెలు కిలకిల నవ్వుతుంటే గాంధారి చెక్కిళ్ళు ఎర్రబడ్డాయి.

"జ్ఞాన చక్షువు వుందట ఆ మహారాజుకి తెలుసా నీకు. నీ మనసు ఎప్పుడూ ఆయన ముందు దాచుకోకు." నవ్వుతున్నారు చెలికత్తెలు.

గాంధారికి ధృతరాష్ట్ర మహారాజు చిత్రపటాన్ని మరొక్కసారి చూడగలిగితే బాగుండు ననిపించింది. తండ్రి సమీపాన ఉన్న చిత్రపటాన్ని లీలగా చూసిందంతే-నల్లని మీసాలు, విశాలమైన ఛాతీ, కండలు తిరిగిన శరీరం- అలా, అలా, కొంత వరకు దూరంగా చూడగలిగింది. కానీ, గాంధారి మనసుకి నవ మన్మథుడిలా తోస్తున్నాడు ధృతరాష్ట్రుడు. అతని ఆకారం ఆమె మనసులో ముద్ర వేసుకుంది. ధృతరాష్ట్ర మహారాజు రాణిగా ఊహాలోకంలో తేలిపోయింది గాంధారి. ఆ ఊహల్లో ఉన్న గాంధారి శిరసున గాలికి వచ్చిన పారిజాతాలు పడ్డాయి. 'తథాస్తు దేవతల దీవన లివే' అనుకొంటూ, సిగ్గుమొగ్గలు తొడుగుతుంటే, ఈ ధృతరాష్ట్రుడే తన భర్త కావాలని మనసులో మరొక్కసారి ఇష్ట దేవతల్ని తల్చుకొని, గబగబా అంతఃపురం ప్రవేశించింది గాంధారి.

గాంధారి అంతఃపురం ప్రవేశించిన కొద్ది నిముషాలకే చెలికత్తె, ఇష్ట సఖి వేగంగా లోపల కొచ్చింది. గాంధారి సోదరుడు శకుని రాకను తెలియపరుస్తూ ఆమె నిష్క్రమించింది.

ధృతరాష్ట్ర మహారాజుతో గాంధారి వివాహం జరిపించటానికి పెద్దలు నిశ్చయించారని పలికి సోదరి గాంధారిని అభినందించాడు శకుని. వివాహం హస్తినాపురంలో చేయాలనే పెద్దల తలంపు కూడా గాంధారికి తెలియపరిచి మరలిపోయాడు శకుని.

సన్నిహితురాలైన చెలికత్తె గాంధారి దగ్గరకు వచ్చి నిల్చింది. ఏదో అసంతృప్తి, ఆవేదన ఆమె ముఖంలో స్పష్టంగా కనిపించాయి గాంధారికి. ఇంత ఆనంద సమయంలో ఆమె ముఖాన వ్యాకులత దేనికో?

"అమ్మా! ఒక విషయం నీకు మనవి చేయాలి నా మనసులో దాచుకుని బాధ పడలేను... కానీ, నీ మనసు బాధపడినా చెప్పక తప్పదు."

చెలికత్తె మాటలు అర్థం కావడం లేదు గాంధారికి.

"ఆ మహారాజుకి అన్ని ఉత్తమ లక్షణాలుండి ఒక్క లోపం ఉందమ్మా!" -చెలికత్తె తలవంచుకొనే ఉంది.

గాంధారి నివ్వెరపోయింది.

"అమ్మా! అతను జాత్యంధుడు."

గాంధారి అప్రయత్నంగా కళ్ళు మూసుకుంది.

ధృతరాష్ట్రుని పైన ఏ క్షణాన తన మనసు లగ్నమైందో, ఆ క్షణాన్నే తను అతనికి అంకితమై పోయింది. అతని పట్టమహిషిగా ఊహలు అల్లుకుంది. అతను వేయి ఏనుగుల బలం గల వీరు డంటే గర్వపడింది. అతను కౌరవ రాజ్యాధిపతి అంటే ఆనందపడింది. తను శతాధిక సంతానవతి అవుతుందంటే మురిసిపోయింది - కానీ, అతను జాత్యంధుడని తెలియగానే తన మనసు వెనక్కి పోతుందా?

తన ప్రేమకున్న శక్తి ఎంతటిదో తెలియదా తనకి? గాంధారి మూసిన కళ్ళు తెరిచే ప్రయత్నం చేయలేదు ఆ మహాత్మునికి చూపులేకపోతే తన కెందుకు?

గాంధారి చీర కొంగు టక్కున చించింది. వెంటనే కళ్ళకు కట్టేసుకుంది

ప్రయాణ సన్నద్ధుడై వచ్చిన శకుని తన సోదరి గాంధారిని చూసి నిశ్చేష్టు డయ్యాడు. ధృతరాష్ట్రునిపైన గాంధారికున్న నిశ్చలమైన ప్రేమకు విస్తుపోతూ, హస్తినాపురం వైపుగా ప్రయాణం సాగించాడు గాంధారితో కలసి. *

(ఆధారం : కవిత్రయంవారి శ్రీమదాంధ్ర మహాభారతం : ఆదిపర్వం : పంచమాశ్వాసం)

(ప్రచురణ : ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక : 13.4.1988)